

టీచర్లు కొడుతున్నా..చెప్పొద్దు

టీచర్లు కొడుతున్న విషయం చెబితే టీసీ ఇస్తానని విద్యార్థినులను బచ్చన్నపేట కేజీబీవీ ఎస్‌ఓ భయభ్రాంతులకు గురిచేస్తుందని తల్లిదండ్రులు ఆరోపించారు. - 8లో▸



లాభసాటి పంటలను ఎంచుకోవాలి

రైతులు లాభసాటి పంటలను ఎంచుకుని సాగు చేయాలని, అన్నదాతలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నాగేశ్వరరావు అన్నారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం

$35^0 / 24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్



నర్మెట: అప్రమత్తంగా ఉంటూ ఫ్రెండ్లీ పోలీస్‌గా విధులు నిర్వహించాలని ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సందర్శించి పలు రికార్డులు, ఠాణా పరిసరాలు, వాహనాలను తనిఖీ చేసి సిబ్బంది కిట్‌లను పరిశీలించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు ముందుండాలన్నారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో సీఐ ముసుకు అబ్బయ్య, ఎస్సై నైనాల నగేష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నేటినుంచి క్రీడాపోటీలు

జనగామ: పంద్రాగస్టు పర్వదినం పురస్కరించుకుని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశాల మేరకు ఈ నెల 12, 13వ తేదీల్లో ఉద్యోగులు, జర్నలిస్టులకు క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి వెంకట్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పురుషుల విభాగంలో క్రికెట్, టగ్ ఆఫ్ వార్, లాంగ్‌జంప్, 100 మీటర్ల రన్, షాట్‌పుట్, డబుల్ క్యారమ్స్, చెస్, మహిళల విభాగంలో టగ్ ఆఫ్ వార్, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్, 100 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్, డబుల్ క్యారమ్, చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడా పోటీల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగస్తులు, జర్నలిస్టులు తమ కార్యాలయంలో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. నేడు (మంగళవారం) పట్టణంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో ఉదయం 9 గంటలకు అందుబాటులో ఉండాలన్నారు. పూర్తి వివరాలకు 9100949979 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

201 మంది టీచర్లకు నో ఎఫ్‌ఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్

జనగామ: ఎఫ్‌ఆర్‌ఎస్ సేవలు ప్రారంభమై 11 రోజులు గడచినా.. వందల సంఖ్యలో టీచర్లు నేటికీ రిజిస్ట్రేషన్ చేసుకోలేదు. ఇందుకు సంబంధించి ఎఫ్‌ఆర్‌ఎస్ (ఫేషియల్ అటెండెన్స్)లో నమోదు కాని ఉపాధ్యాయుల జాబితాను జిల్లా విద్యాశాఖ అధికారులు సోమవారం విడుదల చేశారు. జిల్లాలో 2,800 మంది ఉపాధ్యాయులు ఉండగా 201 మంది టీచర్లు ఇంకా రిజిస్టర్ కాలేదని, వందశాతం నమోదుకు ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సకాలంలో వేతనాలు ఇవ్వాలి



రఘునాథపల్లి : మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా ప్రతీ నెల రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా ఒకటో తేదీన వేతనాలు ఇవ్వాలని మోడల్స్ స్కూల్స్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధికార ప్రతినిధి కందగట్ల గణేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన సంఘం నాయకులతో కలిసి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 194 ఆదర్శ పాఠశాలల్లోని టీచర్లకు ప్రతి నెల వేతనాలు ఆలస్యంగా వస్తున్నాయన్నారు. వేతనాలు సకాలంలో ఇవ్వక పోవడంతో కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు ఒకటో తేదీన వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

న్యూజిలాండ్‌కు తెలంగాణ కళాకారులు

లింగాలఘణపురం: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, ఇండియన్ ఎంబసీ ఆఫ్ న్యూజిలాండ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా అక్లాండ్‌లో నిర్వహిస్తున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రాష్ట్రం నుంచి ఒగ్గుడోలు, పేరిణి కళాకారుల బృందం సోమవారం అక్లాండ్‌కు బయలుదేరారు. లింగాలఘణపురం మండలంలోని మాణిక్యాపురానికి చెందిన ఒగ్గు కళాకారుడు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్, జాతీయ పురస్కార అవార్డు గ్రహీత చౌదరిపల్లి రవికుమార్, మరికుక్కల అశోక్ వేడుకలకు బయలుదేరారు.

'కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్న బీజేపీ'

జఫర్‌గఢ్ : ఎన్నికల కమిషన్‌ను అడ్డుపెట్టుకొని బిహార్‌లో అక్రమ పద్ధతిలో అధికారంలోకి రావాలని బీజేపీ కుట్ర రాజకీయాలకు పాల్పడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య విమర్శించారు. సోమవారం కాట సుధాకర్ అధ్యక్షత పార్టీ మండల కమిటీ నిర్వహించారు. బిహార్‌లో నిర్వహించే ఎన్నికల్లో తనకు వ్యతిరేకంగా ఉన్న ఓట్లను తొలగించి అక్రమ పద్ధతుల్లో అధికారంలోకి రావాలని బీజేపీ ప్రయత్నిస్తోందని తెలిపారు.

వచ్చుడు..ఇచ్చుడే!

- పరిష్కారం కాని ప్రజాసమస్యలు
- ప్రజావాణిలో ఇందిరమ్మ ఇల్లు, భూసమస్యలే అధికం
- వినతులు సత్వరమే పరిష్కరించండి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా
- ప్రజల నుంచి 58 దరఖాస్తులు స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్

జనగామ రూరల్: తన కుమారులు అక్రమంగా భూమి ఆక్రమించారని, దివ్యాంగుల కింద వచ్చే పింఛన్ రావడం లేదని, కూలిన ఇంట్లో ఉంటున్నామని ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి ఆదుకోవాలని, పట్టా పాస్‌బుక్‌లో ఫొటో తప్పుగా పడిందని ఇలా పలు సమస్యలు పరిష్కారం కావడం లేదని, దూర ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు వచ్చుడు.. దరఖాస్తులు ఇచ్చుడే తప్ప పరిష్కారం కావడం లేదని బాధితులు వాపోయారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ జిల్లా అధికారులతో కలిసి వినతులు స్వీకరించారు. మొత్తం 58 దరఖాస్తు రాగా ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. పరిష్కారం కాని దరఖాస్తులు బాధితులకు తగిన కారణంతో అర్థమయ్యే విధంగా వివరించాలన్నారు. గ్రీవెన్స్‌లో డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీఓ గోపిరామ్, ఏఓ శ్రీకాంత్, జిల్లా స్థాయి అధికారులు, పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని ఇలా..

- జనగామ మండలం పెంబర్తి గ్రామానికి చెందిన కె.గీతాంజలి, జనగామ పట్టణంలో 23 వార్డు చెందిన మహమ్మద్ సాజీదాలు అద్దె ఇంట్లో ఉంటున్నామని, తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.
- జనగామ మండలం పెద్దపహాడ్‌కు చెందిన మోకు అనూష తమకు వారసత్వంగా వచ్చిన భూమిని చట్ట ప్రకారం కూతురు మోకు అక్షరకు చెందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
- బచ్చన్నపేటలో సర్వే నంబర్లు 176, 178, 177లోని 2.27 ఎకరాల భూమి కొమురయ్య పేరున ఉందని, తనతో పాటు తన కుమారులైన మల్లయ్య, కనకయ్యలకు సర్వే చేపట్టి సమానంగా వచ్చేలా పట్టా చేయాలని కోరారు.
- తమకు కరెంట్ మీటర్లు ఇచ్చి ఆదుకోవాలని జనగామ 12వ వార్డులోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వినతిపత్రం అందించారు.



ఈ ఫొటోలోని వ్యక్తి పాలకుర్తి మండలం గూడూరు పంచాయతీ మొరుసుగడ్డ తండాకు చెందిన బానోత్ లింగ్యా. ఈయనకు నలుగురు కుమారులు ఉన్నారు. లింగ్యాకు ఉన్న 9.30 ఎకరాల భూమిని తన ఇద్దరు కుమారులు వెంకన్న, శ్రీనివాస్‌లు భూమిని సర్వే చేపిస్తామని తహసీల్దార్ వద్దకు తీసుకెళ్లి అక్రమంగా వారి పేరు మీద పట్టా చేసుకున్నారు. విచారణ చేపట్టి భూమిని తన పేరు మీదకు మార్చి న్యాయం చేయాలని కలెక్టర్‌కు వేడుకున్నాడు.

భూమి ఆక్రమించారు



జనగామ పట్టణంలో సర్వేనంబర్ 223/ఏ/సీలో 20 గుంటల భూమి ఉంది. అందులో 3 గుంటల భూమిని పట్టణానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఆక్రమించి అక్రమంగా కనీలు నాటారు. ఏంటని ప్రశ్నిస్తే ఇబ్బందులు పెడుతున్నారు. విచారణ చేపట్టి న్యాయం చేయాలి.

- బుడిగే వీరస్వామి, జనగామ

పట్టాపాస్ బుక్ ఇవ్వాలి



పట్టా పాస్ బుక్‌లో నా ఫొటో బదులు వేరొకరి ఫొటో వచ్చింది. రెవెన్యూ అధికారులను అడిగితే అసలు పాస్ బుక్ తీసుకుని ట్రూ కాపీలో మార్పు చేసి ఇచ్చారు. అసలు పాస్‌బుక్ ఇవ్వలేదు. అవసరాల నిమిత్తం భూమిని విక్రయించాలంటే అసలు పాస్ బుక్ ఉండాలని రిజిస్ట్రేషన్ అధికారులు తెలుపుతున్నారు. అసలు పాస్‌బుక్ ఇచ్చి న్యాయం చేయాలి.

- పిట్టల రాంచంద్రు, చెన్నూరు, పాలకుర్తి

9 నెలల నుంచి పింఛన్ రావడం లేదు..



2023లో సదరం సర్టిఫికెట్ గడువు తేదీ ముగిసింది. అందులో 52శాతం ఉండగా రెన్యూవల్‌లో 27 శాతం మాత్రమే అధికారులు వేశారు. దీంతో 9 నెలల నుంచి పింఛన్ రావడం లేదు. ఎలాంటి పనులు చేయలేను. సదరం సర్టిఫికెట్, పింఛన్ ఇప్పించి ఆదుకోవాలి.

- నర్సింహుల యాకయ్య, గబ్బెట, రఘునాథపల్లి

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ

- కలెక్టర్ రిజ్వాన్ బాషా



విద్యార్థికి మాత్ర వేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, పక్కన డీఎంహెచ్‌ఓ మల్లికార్జునరావు

జనగామ: విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలలో అడ్డంకిగా మారిన నులిపురుగుల నివారణ ఒక్కటే మార్గమని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు మాత్రలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,13,888 మంది విద్యార్థులకు గాను 1,02,630 (90.11శాతం) మందికి మాత్రలను వేసినట్లు చెప్పారు. మిగిలిన సుమారు 11 వేల మందికి ఈ నెల 18న మాప్ డేను పురస్కరించుకుని మాత్రలను వేస్తామన్నారు. పిల్లల కడుపులో నులి పురుగులు చేరి, రక్తహీనత, ఆకలి మందగించడం, విరేచనాలు, బరువు తగ్గడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడంతో కడుపులో నులిపురుగులు నశించిపోయి, ఆరోగ్యవంతమైన జీవనానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలి

జనగామ రూరల్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రిజ్వాన్‌బాషా సూచించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏఎస్పీ పండరి చేతన్ నితిన్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రౌండ్, వేదికను పోలీస్, రెవెన్యూ అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. జనగామ ఆర్డీఓ వేడుకల ఏర్పాట్లకు ఇన్‌చార్జ్‌గా ఉంటారని వీఐపీ, స్వాతంత్ర్య సమర యోధులు, ప్రజలు కూర్చునేందుకు వీలుగా సీటింగ్ ఏర్పాట్లు ఉండేలా చూడాలన్నారు. వైద్య సిబ్బంది, శానిటేషన్, తాగునీరు, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీఓ గోపిరాం, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే 'పది' పరీక్షలు

- రాత పరీక్షకు 80, ఇంటర్నల్ 20 మార్కులు
- ఉత్తర్వులు జారీ చేసిన పాఠశాల విద్యాశాఖ



జనగామ: రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షలను పాత పద్ధతిలోనే నిర్వహించేలా పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి సోమవారం అధికారికంగా ఉత్తర్వులను జారీ చేసింది. ఈ విధానం 2025–26 విద్యా సంవత్సరం నుంచి అమలు కానుంది. పదో తరగతి వార్షికంలో రాత పరీక్షకు 80, ఇంటర్నల్‌కు 20 కలిపి మొత్తంగా 100 మార్కుల విధానాన్ని తిరిగి తీసుకువచ్చారు. గతేడాది నవంబర్ మాసంలో ఇంటర్నల్ మార్కులను తొలగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి నిర్వహించిన వర్క్‌షాప్‌లో దీనిపై అనేక మంది విద్యావేత్తలు ప్రశ్నించడంతో పాఠశాల విద్యాశాఖ పాత పద్ధతిని అమలు చేయాలనే నిర్ణయంపై ఉత్తర్వులను వెలువరించింది. పాత పద్ధతిలోనే వార్షిక పరీక్షలు రాయనున్న నేపథ్యంలో విద్యార్థులు ఖుషీ ఖుషీగా ఉన్నారు. ఇంటర్నల్ మార్కులను తిరిగి అమలులోకి తీసుకు రావడంతో చదువులో వెనకంజలో ఉన్న పిల్లలకు మేలు చేకూరే అవకాశం ఉందనే అభిప్రాయాన్ని మేధావులు వ్యక్తపరుస్తున్నారు.

నిబంధనల మేరకు నిర్మాణం చేపట్టాలి



మాట్లాడుతున్న రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్, పక్కన కలెక్టర్ రిజ్వాన్ బాషా



నిడిగొండలో లబ్ధిదారుడితో మాట్లాడుతున్న వీపీ గౌతమ్

- లబ్ధిదారులు ఆర్థిక భారాన్ని పెంచుకోవద్దు
- సమీక్షలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్

జనగామ: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు నిబంధనల మేరకు నిర్మాణం చేపట్టేలా అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ ఆదేశించారు. జిల్లాలో ఆయా మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ రిజ్వాన్‌బాషాతో కలిసి ఎంపీడీఓ, హౌసింగ్ ఏఈలతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వీపీ గౌతమ్ మాట్లాడుతూ ఇందిరమ్మ లబ్ధిదారులకు ఆర్థిక భారం తగ్గాలంటే, నిబంధనల ప్రకారమే నిర్మాణాలు చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో మరింత వేగం పెరగాలన్నారు. గృహ నిర్మాణ, రెవెన్యూ, ఎంపీడీఓ హౌసింగ్‌లు సమన్వయంతో ఉచితంగా ఇసుక టోకెన్లను అందించే విధంగా చూడాలన్నారు. ప్రతి 500 ఇళ్లకు ఒక ఏఈ పర్యవేక్షణ తప్పనిసరి అన్నారు. అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ జిల్లాలో 5,745 ఇళ్లకు మంజూరు ఇవ్వగా, ఇప్పటి వరకు 4,560 ఇల్లు గ్రౌండింగ్ పూర్తయిందన్నారు. 1,999 బేస్మెంట్ లెవల్ వరకు పనులు పూర్తి కాగా, 274 రూఫ్ లెవల్, 166 స్లాబ్ లెవల్ వరకు ఇళ్ల నిర్మాణం జరిగిందన్నారు. గృహ నిర్మాణ శాఖ ఎండీ అంతకు ముందు కలెక్టరేట్‌లోని ఫొటో గ్యాలరీని సందర్శించారు. సమీక్షలో హౌసింగ్ పీడీ మాత్రునాయక్, అన్ని మండలాల ఎంపీడీఓలు, ఏఈ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ బిల్లు వచ్చిందా..!

రఘునాథపల్లి: ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ఎప్పుడు ప్రారంభించారు, ఇసుక, మొరం, తదితర విషయాల్లో ఇబ్బందులు ఉన్నాయా, బిల్లు వచ్చిందా? అని ఇందిరమ్మ లబ్ధిదారులను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ అడిగి తెలుసుకున్నారు. సోమవారం మండలంలోని నిడిగొండలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఆయన వెంట పీడీ మాత్రునాయక్, ఆర్డీఓ వెంకన్న, ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు, ఎస్సై దూదిమెట్ల నరేష్, తహసీల్దార్ ఫణికిషోర్ తదితరులు ఉన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే

కొడకండ్ల: సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో అర్హులైన ప్రతీఒక్కరికి ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేస్తూ పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని 84 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ గృహాల మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో నిరుపేదలు సొంతింటి కలను సాకారం చేసుకోలేకపోయారన్నారు. తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెర వేరుస్తూ పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నామని, అర్హులైన ప్రతిఒక్కరికి ఇండ్లు, రేషన్ కార్డులు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్‌నాయక్, మార్కెట్ వైస్ చైర్మన్ సాయికృష్ణ, నియోజకవర్గ, మండల యూత్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, యాకేష్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు రవీందర్, వెంకట్‌రెడ్డి, వెంకన్న, అంజయ్య, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగు రహిత సమాజాన్ని నిర్మించుకోవాలి

పాలకుర్తి టౌన్: 19 సంవత్సరాల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేసి నులిపురుగు రహిత సమాజాన్ని నిర్మించుకోవాలని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని కేజీబీవీలోని విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అంతకుముందు పాఠశాలలో నిర్వహించిన తీజ్ వేడుకలో పాల్గొన్నారు. వైద్యాధికారులు సిద్ధార్థరెడ్డి, స్వప్న, ఎంపీడీఓ రవీందర్, ఎంఈఓ నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి

వర్షాకాలంలో విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని తొర్రూరు, పెద్ద వంగర, దేవరుప్పుల మండలాల విద్యుత్ శాఖ డీఈలు, ఏడీలు, ఏఈలతో సమీక్ష నిర్వహించారు.

ప్రయాణికులు ఫుల్..సౌకర్యాలు నిల్

- సీటు కోసం కోటి కష్టాలు
- వానొస్తే నరకమే..
- తిరుగు ప్రయాణంలో ప్రయాణికులు కష్టాలు
- బస్సుల కోసం బస్టాండ్‌లో నిరీక్షణ



పాలకుర్తి బస్టాప్ వద్ద ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

జనగామ: రాఖీ పండుగ, బోనాల జాతర ముగించుకుని తిరుగు ప్రయాణం వెళ్తున్న ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేవు. రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులను నడిపించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ నెల 9న రాఖీ, 10న బోనాల జాతర ఉండడంతో దసరాకు మించి ఊళ్లలో పండుగ వాతావరణం నెలకొంది. పుట్టింటికి చేరుకునే సమయంలో అవస్థలు పడ్డ ఆడపడుచులు, తిరిగి వెళ్లే సమయంలో రెట్టింపు బాధలు పడ్డారు. జనగామ బస్టాండ్‌లో వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు బస్సుల కోసం నిరీక్షించే సమయంలో కూర్చునే సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు తప్పలేదు. స్పెషల్ టికెట్ ధరలు పెంచడంలో ఉన్న ఉత్సాహం, ప్రయాణికులకు తగ్గట్టుగా సర్వీసులను నడిపించడంలో ఒక్కశాతం శ్రద్ధ చూపించినా ఇంతటి కష్టాలు ఉండకపోయేవని ప్రయాణికులు ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు.



బస్టాండ్ ఆవరణలోని ఆలయం వద్ద తలదాచుకున్న ప్రయాణికులు

సౌకర్యాలను మెరుగు పరిచేదెప్పుడు?

జనగామ బస్టాండ్‌లో వంద నుంచి రెండు వందల మంది కూర్చునే సౌకర్యం ఉండగా.. వేలాది మంది ప్రయాణికులతో కిక్కిరిసి పోవడంతో కనీసం నిలబడే పరిస్థితి లేకుండా పోయింది. బస్సులో సీటు ఏమో కానీ.. కనీసం నిలబడేందుకు కూడా చోటు దక్కించుకునేందుకు ప్లాట్ ఫాంపైకి సర్వీసు రాకముందే ప్రాణాలను పణంగా పెట్టి ఎదురుగా వెళ్లే ప్రయత్నం చేశారు. ఇదే సమయంలో వర్షం రావడంతో కొత్తగా నిర్మాణం చేస్తున్న ప్లాట్ ఫాంతో పాటు పాలకుర్తి రూట్ బస్సులు ఆగే ప్రదేశం, శ్రీసీతారామాంజనేయ ఆలయం వద్ద తలదాచుకున్నారు. జనగామ జిల్లాగా ఆవిర్భవించి 11 సంవత్సరాలు గడిచినా.. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా హెడ్ క్వార్టర్‌లోని బస్టాండ్‌లో సౌకర్యాల కల్పనను దృష్టి సారించడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.



కూర్చునే స్థలం లేక ఇబ్బంది పడుతున్న మహిళలు



ప్రయాణికులతో కిక్కిరిసిన బస్టాండ్



సీటు కోసం పోటీ పడుతున్న ప్రయాణికులు

అదుపు తప్పి ధాన్యం లారీ బోల్తా



బచ్చన్నపేట: జనగామ, సిద్దిపేట రహదారి మండలంలోని కొడవటూర్ కమాన్ సమీపంలో ప్రమాదవశాత్తు ధాన్యం లారీ బోల్తా పడిన సంఘటన సోమవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. కామారెడ్డి నుంచి ధాన్యం లోడుతో ఏపీ రాష్ట్రం తణుకు వెళ్తున్న లారీ కొడవటూర్ కమాన్ సమీపంలోకి రాగానే అధిక స్పీడ్‌తో పాటు గుంతలమయంగా ఉన్న రోడ్డు కారణంగా లారీ కమాన్ పట్టీలు విరిగిపోయాయి. దీంతో లారీ రోడ్డుపై బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ చెన్నారావుకు స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్ అక్కడికి చేరుకుని జేసీబీ సాయంతో లారీని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేయించారు. కమాన్ సమీపంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు గుంతల రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

లిక్విడ్ క్యాష్ ఇస్తానంటూ..

- రూ.1.50 లక్షలు ఫోన్‌పే చేయించుకుని పారిపోయిన గుర్తుతెలియని వ్యక్తి

లింగాలఘణపురం: మండలంలోని కిష్టగూడెం పెట్రోల్ బంక్‌లో క్యాషియర్‌గా పని చేస్తున్న లకావత్ వీరన్న నుంచి గుర్తు తెలియని వ్యక్తి రూ.1.50 లక్షలు లిక్విడ్ క్యాష్ ఇస్తానంటూ ఫోన్ పే చేయించుకొని పరారైన సంఘటన ఆదివారం జరిగింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పెట్రోల్ బంక్‌లో క్యాషియర్‌గా పని చేస్తున్న లకావత్ వీరన్న వద్దకు గుర్తు తెలియని వ్యక్తి నంబర్ ప్లేట్‌లేని స్కూటీపై వచ్చి నా క్రెడిట్ కార్డు డీ ఆక్టివేట్ అయింది.. ఆక్టివేట్ చేసుకుంటా లిక్విడ్ క్యాష్ రూ.1.50 లక్షలు ఇస్తాను.. నాకు ఫోన్‌పే చేయండి.. అందుకు మీకు కమీషన్ లక్షకు రూ.1,000 నుంచి రూ.2,000లు ఇస్తానని చెప్పగానే సదరు బంక్‌లో పని చేసే క్యాషియర్ అతని ఫోన్‌పేకు మూడు విడతలుగా రూ.1.50 లక్షలు ఫోన్ పే చేశాడు. అనంతరం ఇంత డబ్బు తన వద్ద లేదని, పాలకుర్తిలో తెలిసిన వారున్నారని, అక్కడికి తనతో మరో వ్యక్తిని పంపించండి, అక్కడ డబ్బులు ఇస్తానని చెప్పగా.. బంక్‌లో పని చేసే అస్నాల రాజు అనే వ్యక్తిని స్కూటీపై పంపించాడు.

మూత్ర విసర్జన కోసమని..

ఇద్దరి కలిసి పాలకుర్తికి వెళ్తుండగా మార్గమధ్యలో మూత్ర విసర్జన వస్తుందని గుర్తు తెలియని వ్యక్తి స్కూటీని స్లో చేసి తనతో వచ్చిన రాజును దిగాలని కోరాడు. దీంతో రాజు దిగగానే స్కూటీ వేసుకుని పారిపోయాడు. రాజుకు ఏమీ చేయాలో తెలియక తిరిగి బంక్‌లోకి వచ్చి యజమాని ఆనంద్‌కు జరిగిన విషయం చెప్పాడు. కమీషన్ కోసం ఆశపడి గుర్తు తెలియని వ్యక్తి చేతిలో మోసపోయామని తెలుసుకొని సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్సై శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా ఈ కేసు సైబర్ క్రైంకు సంబంధించిందని, 1930కు ఫిర్యాదు వస్తే అక్కడి నుంచి వచ్చిన దానిని బట్టి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

ఎన్‌ఐఆర్‌ఎఫ్ వర్క్‌షాప్‌లో కేయూ వీసీ


వర్క్‌షాప్‌లో వీసీ ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తదితరులు

కేయూ క్యాంపస్: రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో సోమవారం నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్) ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందులో కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి, కేయూ ఐక్యూఏసీ డైరెక్టర్ జి. షమిత, డాక్టర్ ఫణీంద్రకుమార్, బన్సూర్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్ సలహాదారు డాక్టర్ కె. వీరాంజనేయులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్‌లో కొలమానం, విశ్లేషణ విధానాలు వివరించారని వీసీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ వి. బాలకిష్టారెడ్డి నైపుణ్యాల అభివృద్ధికి అనుసరించాల్సిన కార్యాచరణను వివరించారు. తొలుత ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డి. రాజిరెడ్డి.. కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు.

సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు అవసరం

- కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం

కేయూ క్యాంపస్: సమాజానికి ఉపయోగపడే నాణ్యతాప్రమాణాలతో కూడిన పరిశోధనలు అవసరమని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి. రామచంద్రం అన్నారు. హనుమకొండ యూనివర్సిటీ న్యాయ కళాశాలలోని పీహెచ్‌డీ స్కాలర్లకు సోమవారం నిర్వహించిన ఓరియెంటేషన్ తరగతుల ముగింపు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ ఓరియెంటేషన్ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను పరిశోధకులుగా మీ సిద్ధాంత గ్రంథాల్లో నాణ్యతాప్రమాణాలతో రూపొందించాలన్నారు. గౌరవ అతిథి, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ గజ్జెల రామేశ్వరం మాట్లాడుతూ సానుకూల దృక్పథంతో ఆదర్శంతమైన పరిశోధకులుగా రాణించాలన్నారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. సుదర్శన్ మాట్లాడుతూ ఈ ఓరియెంటేషన్ తరగతులు వారంరోజులపాటు వివిధ సబ్జెక్టు నిపుణలతో పరిశోధనల అంశాలపై నిర్వహించామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రభాకర్, శ్రీనివాస్, అధ్యాపకులు హరిప్రసాద్, సుజాత, వేదశ్రీ , లక్ష్మణ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కోలా శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ ఫలితాల్లో భావన ప్రతిభ..

- రాష్ట్ర స్థాయిలో తృతీయస్థానం


భావనకు మెమోంటో అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసి ఎమ్మెస్సీ ఓబీజీ ఫలితాల్లో నర్సంపేటకు చెందిన వైద్యాధికారి పానుగంటి భావన ప్రతిభ కనబర్చి రాష్ట్రంలో తృతీయ స్థానంలో నిలిచారు. వివరాలు ఇలా ఉన్నాయి. నర్సంపేటకు చెందిన మమత ఆస్పత్రి వైద్యులు భారతి, గోపాల్ దంపతుల కూతురు పానుగంటి భావన హైదరాబాద్ నాగోల్‌లోని కామినేని అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్ సెంటర్‌లో ఎమ్మెస్సీ ఓబీజీ విద్యనభ్యసించారు. ఈ క్రమంలో ఇటీవల వెల్లడైన ఫలితాల్లో కామినేని మెడికల్ కళాశాలలో ఓవరాల్‌గా ప్రథమ స్థానం, రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం సాధించారు. ఈ సందర్భంగా కామినేని వైద్య కళాశాల యాజమాన్యం భావనను మెమోంటో అందజేసి సన్మానించారు. కళాశాల ఎండీ వసుంధర, శశిధర్, కళాశాల సూపరింటెండెంట్ అజయ్య, వైస్ ప్రిన్సిపాల్ పావని, అధ్యాపకులు, ఓబీజీ విద్యార్థులు, నర్సంపేట ఐఎంఏ అధ్యక్షుడు బీఎం జయుడు, డాక్టర్ ఉదయ్‌సింగ్, డాక్టర్ రాజారాంతోపాటు పలువురు వైద్యులు, నర్సంపేట విద్యాసంస్థల అధినేతలు తదితరులు అభినందించారు. కాగా, ఈ సందర్భంగా భావనను తల్లిదండ్రులు గోపాల్, భారతి అభినందించారు.

చైన్‌స్నాచర్లకు దేహశుద్ధి


పట్టుబడిన చైన్‌స్నాచర్లు

తొర్రూరు రూరల్: చైన్ స్నాచింగ్‌కు పాల్పడి పారిపోతున్న ఇద్దరు యువకులకు గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. ఈ ఘటన సోమవారం తొర్రూరు మండలం మాటేడులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం .. మాటేడుకు చెందిన ముత్యం ప్రేమలీల రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తోంది. ఈ క్రమంలో ఇతర రాష్ట్రానికి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై వెళ్తూ ప్రేమలీల మెడలోని పుస్తెలతాడును లాక్కొని పారిపోతుండగా బాధిత మహిళ కేకలు వేసింది. దీంతో స్థానికులు గమనించి ఆ యువకులను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులను వివరణ కోరగా ఆ యువకులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు.

ఓపెన్ డిగ్రీ ప్రవేశాలకు గడువు..

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2025-2026 విద్యాసంవత్సరంలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 13వ తేదీ వరకు గడువు ఉంది. ఇంటర్ రెండేళ్లు, ఐటీఐ, ఓపెన్ ఇంటర్ 10ప్లస్2 , పాలిటెక్నిక్ ఉత్తీర్ణులైన విద్యార్థులు కూడా డిగ్రీ కోర్సులో అడ్మిషన్లు పొందొచ్చు. ఆదివాసీలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు డిగ్రీ కోర్సుల్లో ఉచిత ప్రవేశాలకు అవకాశం కల్పించిన నేపథ్యంలో వారు కూడా దరఖాస్తులు చేసుకునే వీలుకల్పించబోతున్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బిఆర్‌ఏఓయూ ఆన్‌లైన్ .ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సింటుంది.

సమానత్వపు సమాజం దిశగా..

ఆదివాసీలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత విద్య

- బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీలో సమతా సహాయక పథకం
- డిగ్రీలో ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు..
- స్టడీ మెటీరియల్, పాఠ్యపుస్తకాలు ఫ్రీ



కేయూ క్యాంపస్: సమాజంలో వివక్ష, అవహేళన, నిరాదరణకు గురవుతున్న ఆదివాసీలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు ఇక నుంచి ఉన్నత విద్య అనే ఆయుధంతో సగౌరవంగా జీవించగలరు. ఆయా వర్గాల్లో విజ్ఞానం, నైపుణ్యం, ఆత్మవిశ్వాసం పెరిగి స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో తాజాగా సమతా సహాయక పథకాన్ని (సమతా ఫ్రీషిప్) ప్రారంభించారు. విద్యను సామాజిక మార్పు, సాధికారతకు అత్యంత శక్తివంతమైన సాధనంగా గుర్తిస్తూ సమతా సహాయక పథకాన్ని చేపట్టారు. ఈ ఉన్నత విద్య డిగ్రీలో తక్కువ ప్రాతినిధ్యం ఉన్న వర్గాలు, ప్రధాన సమూహాలకు ఉచిత విద్యనందించేందుకు నిర్ణయించారు. ఇప్పటికే ఆ యూనివర్సిటీ పాలకమండలి కూడా ఆమోదించింది. ఇందులో ప్రధానంగా ఆదివాసీలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు ఈ సమతా సహాయక పథకం కింద ఉన్నత విద్య డిగ్రీ చదువుకునేందుకు ఈ విద్యాసంవత్సరం 2025-2026లోనే ఉచిత విద్యనందించబోతుంది. ఈ మేరకు అడ్మిషన్ల ప్రక్రియ, ప్రోఫార్మాలో మార్పులు చేపట్టారు. దీంతో ఆర్థిక సమస్యలు, వివిధ కారణాలతో ఉన్నత విద్యకు దూరమైన ఆయా వర్గాలు చదువుకునే వీలు కలగబోతుంది.

ఆదివాసీల్లో ఈతెగలకు..

ఆదివాసీల్లో ప్రధానంగా తెలంగాణలో ఉన్న చెంచులు, గోండులు, కోయ, గొత్తికోయ, కొండరెడ్లు, నాయక్ పోడ్, పార్ధాన్, తోటి తెగల్లోని యువతకు అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఉచిత విద్యనదించబోతున్నారు. కేవలం రూ. 500 ఫీజు రిజిస్ట్రేషన్‌తోనే అడ్మిషన్లు కల్పిస్తారు. పుస్తకాలు కూడా అందజేస్తారు. కులం, నివాస ధ్రువీకరణ పత్రాలతోపాటు వార్షిక ఆదాయం (తాజా) రూ. 2 లక్షల లోపు ఉన్న వారికి ఈ పథకం వర్తించనున్నది.

దివ్యాంగులకు..

దివ్యాంగులకు కూడా పథకం వర్తింపజేశారు. 40 శాతం వైకల్యం కలిగిన యువత డిగ్రీలో ప్రవేశాలు పొందొచ్చు. నామినల్ ఫీజు వీరికి కూడా రూ. 500 మాత్రమే. వీరికి గతంనుంచే పరీక్ష ఫీజు కూడా లేదు. నివాస ధ్రువీకరణపత్రంతోపాటు వార్షిక ఆదాయం రూ. 6లక్షల లోపు కలిగి ఉన్న వారు కూడా అర్హులే. సదరం సర్టిఫికెట్ తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది.

ట్రాన్స్‌జెండర్లకు..

ట్రాన్స్‌జెండర్లు సమాజపు అపహాస్యం, వివక్ష కారణంగా ప్రధాన విద్యావ్యవస్థ నుంచి బయటకు నెట్టివేయబడుతున్నారు. వీరికి కూడా ఉచిత ఉన్నత విద్య అందించేందుకు అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అవకాశం కల్పించేందుకు ఉపక్రమించింది. ఈ వ్యవస్థాపరమైన అసమానతలను తగ్గించడమే లక్ష్యంగా సమతా సహాయక పథకాన్ని రూపొందించారు. ట్రాన్స్‌జెండర్లు జెండర్ ధ్రువీకరణపత్రం, ఆదాయం అర్బన్ ప్రాంతంవారికి రూ. 2లక్షల వరకు, గ్రామీణం రూ. లక్షా 50వేల వరకు ఉన్న వారికే ఈపథకం వర్తింపు. వీరు కూడా రూ .500 ఫీజుతో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

సమతా సహాయక పథకం ప్రధాన సదుపాయాలు..

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఈ సమతా సహాయక పథకం కింద ప్రధాన సదుపాయాలు ఇలా ఉన్నాయి. అర్హులైన విద్యార్థులు కేవలం రూ .500 నమోదు రుసుము మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.ట్యూషన్ ఫీజు ఉండదు. పరీక్ష రుసుములు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.
- ఉచిత కోర్సు మెటీరియల్, అవసరమైన పాఠ్యపుస్తకాలు అందజేస్తారు. ఆన్‌లైన్ వనరులను ఉచితంగానే అందజేస్తారు. బీఆర్‌ఏఓయూ ఆన్‌లైన్ పోర్టల్ వీడియో, ఆడియో పాఠాలు, డిజిటల్ కోర్సు మెటీరియల్‌ను ఉచితంగానే అందుబాటులో ఉంటాయి.
- వారాంతంలో కౌన్సెలింగ్ తరగతులు, సమీప స్టడీసెంటర్లలో తరగతులకు హాజరు కావొచ్చు.
- తెలంగాణలోనే శాశ్వత నివాసి కావాల్సి ఉంటుంది. ప్రభుత్వ ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.
- ఫ్రి షిప్ కొనసాగాలంటే గత సంవత్సరం అన్ని సబ్జెక్టులు ఒకేసారి ఉత్తీర్ణత కావాల్సి ఉంటుంది.

ఉచిత విద్యతో నమోదు పెరగనుంది..



అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఈ విద్యాసంవత్సరం నుంచి డిగ్రీలో ఆదివాసీలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత విద్యను ప్రవేశపెట్టిన నేపథ్యంలో వివిధ కోర్సుల్లో నమోదు పెరిగే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఈయూనివర్సిటీ పరిధిలో 104 స్టడీ సెంటర్లు ఉన్నాయి. డిగ్రీ, పీజీ డిప్లొమా కలిపి సుమారు 39 కోర్సులు నిర్వహిస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 స్టడీ సెంటర్లు ఉన్నాయి. సమతా సహాయక పథకం కింద ఆర్థిక, సాంస్కృతిక అడ్డంకులు తొలగి సమానత్వ సమాజం ఏర్పడుతుందని భావిస్తున్నాం. ఆయా వర్గాల్లో విజ్ఞానం, నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం పెరిగి స్వయం సమృద్ధి సాధిస్తారు.

– డాక్టర్ వై. వెంకటేశ్వర్లు, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థి సేవావిభాగం డైరెక్టర్

అరుణకీర్తిపతాకకు గజల్ కవి పురస్కారం


అరుణకీర్తిపతాకకు గజల్ కవి పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

హన్మకొండ కల్చరల్ : హనుమకొండకు చెందిన గజల్ రచయిత్రీ, గాయని గంకిడి అరుణకీర్తిపతాక రెడ్డికి గజల్ కవి పుస్కారం అందజేశారు. ఈ మేరకు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో కళారత్న డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన గజల్ కవయిత్రీ విజయగోలి రాసిన మూడో గజల్ సంపుటి నవరాగిణి పుస్తకావిష్కరణ, తెలుగు గజల్ గాన విభావరి జరిగాయి. ఈ కార్యక్రమంలో అరుణకీర్తిపతాక పాల్గొని గజల్ వినిపించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అరుణకీర్తిపతాకను సన్మానించి పురస్కారం అందజేశారు.

రచనలతో సమాజంలో మార్పు

- మామునూరు పోలీస్ ట్రైనింగ్ కళాశాల డీఎస్పీ కూజా విజయ్‌కుమార్


కవితాసంపుటిని ఆవిష్కరిస్తున్న డీఎస్పీ కూజా విజయ్‌కుమార్

హన్మకొండ కల్చరల్ : కవులు తమ రచనల ద్వారా సమాజంలో మార్పులు తీసుకొస్తారని, రాసే పదాలలో నిగూడార్థం దాగి ఉంటుందని మామునూరు పోలీస్ ట్రైనింగ్ కళాశాల డీఎస్పీ కూజా విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలో కవయిత్రీ బాదం జయశ్రీ, వెంకటేశ్వర్లు దంపతుల షష్ఠిపూర్తి కార్యక్రమం జరిగింది. ఇదే సందర్భంలో జయశ్రీ రాసిన 'మదిలో మెదిలిన మాటలు' కవితాసంపుటి ఆవిష్కరణ జరిగింది. డీఎస్పీ కూజా విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని పుస్తకావిష్కరణ చేశారు. విశిష్ట అతిథి, సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ కవితలు ప్రతీఒక్కరిని ఆలోచింపచేసేలా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా జయశ్రీ పుస్తకాన్ని తన భర్త వెంకటేశ్వర్లుకు అంకితమిచ్చారు. కార్యక్రమంలో సౌమ్య, రాకేశ్, రెయాన్ష్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన మద్యం మత్తు..

- ప్రభాకర్ హత్య ఘటనలో నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ తిరుపతిరావు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ రూరల్ : మద్యం మత్తు మిత్రుడి ప్రాణం తీసింది. మహబూబాబాద్ పట్టణంలోని లెనిన్ నగర్ కాలనీకి చెందిన యువకుడు తూళ్ల ప్రభాకర్ ఈ నెల 3వ తేదీన దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ ఎస్.తిరుపతిరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. లెనిన్ నగర్ కాలనీకి చెందిన సంపతి శ్రీను, తూళ్ల ప్రభాకర్ స్నేహితులు. ఈ నెల 3వ తేదీన రాత్రి ప్రభాకర్ మద్యం సేవిస్తున్నాడు. ఎందుకు తాగుతున్నావని అప్పటికే మద్యం సేవించి ఉన్న శ్రీను అడిగాడు. ఈ క్రమంలో ప్రభాకర్ నువ్వేంది నాకు చెప్పేదని శ్రీనును అసభ్యకర పదజాలంతో దూషించాడు. ఫలితంగా ఇద్దరి మధ్య మాటామాట పెరిగి ఘర్షణ జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన శ్రీను.. పక్కన ఉన్న కర్రతో తల, ముఖంపై కొట్టగానే ప్రభాకర్ తీవ్ర రక్తస్రావమై కింద పడిపోయి కొంత సమయానికి మృతిచెందాడు. భయంతో శ్రీను అక్కడి నుంచి ఖమ్మం వెళ్లి అక్కడ మిల్లుల్లో పని చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో రైలులో మహబూబాబాద్ వచ్చి ఇంటికి వెళ్తుండగా పోలీసులు కనిపించారు. దీంతో భయంతో పారిపోవడానికి ప్రయత్నించగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా తూళ్ల ప్రభాకర్‌ను హత్య చేసింది తానేనని ఒప్పుకున్నాడు. దీంతో శ్రీనును అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తిరుపతిరావు తెలిపారు.

టీచర్లు కొడుతున్న విషయం చెప్పొద్దు..

- అలా చేస్తే టీసీలు ఇచ్చి ఇంటికి పంపుతా..
- విద్యార్థినులను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఎస్‌ఓ
- అధికారులు పట్టించుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు


బచ్చన్నపేట కేజీబీవీ ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు(ఫైల్)

బచ్చన్నపేట : విద్యార్థులను కంటికి రెప్పలా చూసుకుంటూ విద్యాబుద్ధులు నేర్పించాల్సిన బాధ్యత గురువులదే. అయితే గురువులే ఇబ్బందులకు గురి చేస్తే ఆ విద్యార్థులు ఎవరికి చెప్పుకోవాలి. టీచర్లు కొడుతున్న విషయం తల్లిదండ్రులకు చెప్పొద్దని, ఒకవేళ చెప్పితే టీసీలు ఇచ్చి ఇంటికి పంపిస్తానని స్పెషలాఫీసర్(ఎస్‌ఓ) భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పలువురు విద్యార్థినులతోపాటు తల్లిదండ్రులు వాపోయారు. మండల కేంద్రంలోని కేజీబీవీ స్పెషలాఫీసర్ గీత విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తల్లిదండ్రులు శుక్రవారం నిరసన తెలిపిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థులు, తల్లిదండ్రుల కథనం ప్రకారం.. రాఖీ పండుగ నిమిత్తం తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లడానికి తల్లిదండ్రులు గురువారం ఉదయం రాగా వారితో స్పెషలాఫీసర్ దురుసుగా ప్రవర్తించారు. గురువారం వస్తే శుక్రవారం ఉదయం రమ్మని తెలిపారు. దీంతో మరుసటి రోజు ఉదయం వెళ్తే సాయంత్రం వరకు ఆగాలని తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేశారు. తమ పిల్లలను టీచర్లు కొడుతున్నారని, ఆ విషయాన్ని తమకు చెప్పితే టీసీలు ఇచ్చి ఇంటికి పంపిస్తానని విద్యార్థినులను స్పెషలాఫీసర్ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తల్లిదండ్రులు పేర్కొన్నారు. పాఠశాలలోకి అధికారులు, పాత్రికేయులు వెళ్లొద్దని, కేవలం మహిళలను మాత్రమే అనుమతిమస్తామని ఎస్‌ఓ చెప్పారన్నారు. విద్యార్థులను కొట్టి ఆస్పత్రికి తీసుకెళ్లిన విషయం ఇతరులకు తెలియకుండా చీకటి గదిలో బంధించిన ఘటనలు కూడా ఉన్నాయని తెలిపారు. దీంతో విద్యార్థులు చదువుకోవాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారని, పాఠశాలకు వెళ్లమని మారాం చేస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ అధికారులు, కలెక్టర్.. పాఠశాలను తనిఖీ చేసి సదరు స్పెషలాఫీసర్‌పై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై పాఠశాల స్పెషలాఫీసర్ గీతను వివరణ కోరగా రాఖీ పండుగకు తల్లిదండ్రులు కోరగానే విద్యార్థులను పంపించానని, కొట్టి చీకటి గదిలో బంధించానని పేర్కొనడంలో వాస్తవం లేదన్నారు. అనవసరంగా తమ పాఠశాలను బద్నాం చేస్తున్నారన్నారు.

లాభసాటి పంటలు ఎంచుకోవాలి

- రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- ఆయిల్ పామ్ సాగుతో అధిక రాబడి
- రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్: రైతులు లాభసాటి పంటలను ఎంచుకుని సాగు చేయాలని, అన్నదాతలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని ఇంచర్ల శివారులో కేన్ బయో సైన్సెస్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ధనసరి సీతక్క, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, పట్టుపరిశ్రమ శాఖ సంచాలకుడు షేక్ యాస్మిన్ బాషా, కలెక్టర్ దివాకరతో కలిసి శంకుస్థాపన, భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడారు. ములుగు జిల్లా పర్యాటక ప్రాంతంగా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ములుగు వ్యవసాయానికి అనువైన జిల్లా అన్నారు. ఆయిల్ పామ్ రైతులకు మార్కెటింగ్ ఇబ్బందులు లేకుండా రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో పామ్ ఆయిల్ ఫ్యాక్టరీల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ములుగు జిల్లాలో ప్రస్తుతం 5 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగవుతోందని, అది వచ్చే ఏడాదికి 10 వేల ఎకరాలు పెంచాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు బీసీలకు 70 నుంచి 80 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం సబ్సిడీ అందిస్తుందన్నారు. మూడున్నర ఏళ్లలో పంట కోతకు వస్తుందన్నారు. ఆయిల్ పామ్ గింజలు టన్ను రూ. 18 వేలు ఉందని, భవిష్యత్‌లో రూ. 25 వేలకు పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో తక్కువ కష్టం.. అధిక రాబడి

ఆయిల్ పామ్ సాగుతో రైతులకు తక్కువ కష్టం.. అధిక రాబడి ఉంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఆయిల్ పామ్ సాగుతో ప్రతీ ఏడాది రైతులకు రూ. లక్ష నుంచి లక్షన్నర వరకు లాభం చేకూరుతుందన్నారు. జిల్లాలో ఫ్యాక్టరీ ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశం, వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహిళా సంఘాలకు విజయ డెయిరీ నుంచి గురుకులాలకు పాల సరఫరాకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. జిల్లాకు త్వరలో మరో ఐటీ కంపెనీ రాబోతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు, ఉద్యాన శాఖ అధికారి సంజీవరావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, కేఎస్ బయోసైన్స్ కంపెనీ ఎండి సుధారెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ

బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క విమర్శించారు. ఈమేరకు సోమవారం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మంత్రి సీతక్క విలేకరులతో మాట్లాడారు. రామరాజ్యం అంటే దొంగ ఓట్లతో దొడ్డిదారిన అధికారంలోకి రావడమా అని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ నేతలను అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. బీజేపీ నాయకులు రామభక్తులు అయితే ఎన్నికల కమిషన్ ద్వారా ఓటర్ లిస్టును బయటపెట్టాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం అణచివేతను ఆయుధంగా చేసుకుని అరెస్టులు చేయిస్తోందన్నారు. ప్రజాతీర్పుకు విరుద్ధంగా బీజేపీ దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిందని ఆధారాలతో సహా బయటపడిందని చెప్పారు. బీజేపీ దుర్మార్గపు నిర్ణయాలను ప్రతీ గడపకు వెళ్లి ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లాడి రాంరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

మూగబోయిన మహిళా చైతన్య దీప్తి..

- ప్రముఖ రచయిత్రీ అనిశెట్టి రజిత హఠాన్మరణం


అనిశెట్టి రజిత(ఫైల్)

హన్మకొండ కల్చరల్ : మహిళా చైతన్య దీప్తి మూగబోయింది. హనుమకొండకు చెందిన ప్రముఖ రచయిత్రీ అనిశెట్టి రజిత సోమవారం రాత్రి కన్నుమూశారు. అనిశెట్టి రజిత మహిళా చైతన్యానికి ప్రతీకగా నిలిచారు. అనేక కథలు, విమర్శనవ్యాసాలు, సమీక్షలు, ఉద్యమ డాక్యుమెంట్లు రాశారు. కుటిలరాజకీయాలకు లేని బలం కలానికి, నిజానికి ఉందని నమ్మి కవిత్వమే శ్వాసగా జీవించారు. 52 సంవత్సరాలుగా కవితావ్యాసంగం కొనసాగిస్తూ, వివిధ ఉద్యమాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తూ కూడా నిరాడంబరంగానే కనిపించేవారు. నాలుగు దశాబ్దాల కాలంలో జీవనదిలా అన్ని ఉద్యమాలకు ఊటనీరందిస్తూ చైతన్యాన్ని సజీవంగా ఉంచారు. ఆమె కవితలో శిల్పంపై వ్యామోహం తక్కువ, వస్తువుపై ప్రాధాన్యం ఎక్కువ ఉంటుంది.

ప్రస్థానం..

అనిశెట్టి రజితది హనుమకొండలోని కుమార్‌పల్లి. బాలరాజు, జయలక్ష్మి దంపతులకు 1958 ఏప్రిల్ 14న జన్మించారు. కాజీపేట ఫాతిమా బాలికల పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంలో 10వ తరగతి వరకు చదువుకున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎంఏ(తెలుగు), ఎంఫిల్ పూర్తి చేశారు. అలాగే, ఇదే విశ్వవిద్యాలయంలో ఎంఏ(ప్రభుత్వ పాలనాశాస్త్రం) చదివి యునివర్సిటీ ఫస్ట్ ర్యాంకు సాధించారు. కేయూలోనే ఎంఫిల్ పూర్తిచేసి కొంతకాలం ఉమెన్స్ స్టడీ సెంటర్, ఎస్సీ, ఎస్టీ సెల్‌లో పరిశోధకురాలిగా పనిచేస్తూ అనేక జాతీయ సదస్సుల్లో పత్ర సమర్పణ చేశారు. 1969-71 మధ్య తెలంగాణ ఉద్యమం ముగింపు దశలో చురుగ్గా పాల్గొన్నారు. 1975లో పైసా కవితతో స్టేజీపై కవితలు చదవడం ఆరంభించారు. అప్పటి నుంచి నిరంతరం కృషి చేస్తూ దళిత, బహుజన, స్త్రీ వాద, పౌర, మానవ హక్కుల, సాహిత్య, సామాజిక ఉద్యమాలన్నింటిలోనూ మమేకమై అనేక స్థానిక, జాతీయ వేదికలు, సంఘాల్లో క్రియాశీలకంగా పనిచేశారు.

ప్రచురణలు..

గులాబీలు జ్వలిస్తున్నాయి(1984), నేనొక నల్లమబ్బునవుతా(1997), చెమటచెట్టు(1999), ఓ లచ్చవ్వ (దీర్ఘకవిత 2000-2005), ఉసురు(కవితా సంపుటాలు 2002), గోరంతదీపాలు (నానీలు 2005), దస్తఖత్ (హైకులు 2005), అనగనగా కాలం (2005), మట్టిబంధం (కథలు 2006), నన్నే ఓ నన్నే (నానీలు 2007), మార్కెట్ స్మార్ట్ శ్రీమతి. (దీర్ఘ కవిత 2010)

సంపాదకీయాలు..

వెతలే కథలై(రచయిత్రుల కథాసంకలనం 2011), ఊపిరి (తెలంగాణలో ఆత్మహత్యలపై నిరసన కవిత 2012), జిగర్ (తెలంగాణ విశిష్ట కవితా సంకలనం 2013), ఉద్విగ్న(లైంగిక భారతంపై ఓరుగల్లు కవుల నిరసన 2013), ఆకాశపుష్పం (అపూర్వ త్యాగానికి నీరాజనం 2014), ముజఫర్‌నగర్ మారణకాండ(నిషిద్ధమేఘాల్లోకి మాయాత్ర 2014),2 0 14లో పోలవరం ప్రాణాంతక ప్రయోగం వెలువరించగా 2016లో అక్షరశరధి దాశరథి, నిర్భయాకాశం పుస్తకాలు ప్రచురించారు. 2017 ఆమె సంపాదకత్వంలో భిన్న అస్తిత్వాల స్త్రీల సాహిత్యం- పరిచయ వ్యాసాలు తీరొక్క పూల పుస్తకం వెలువరించారు.

అవార్డులు..

2017లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్ర విశిష్ట మహిళా పురస్కారం అందుకున్నారు. పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం ప్రతిభాపురస్కారం, అలిశెట్టి ప్రభాకర్ స్మారక పురస్కారం, లయన్స్ ఇంటర్నేషనల్ పురస్కారం, కృష్ణవేణి కళాసమితి ఉగాది పురస్కారం తదితర అనేక అవార్డులు ఆమె సొంతం చేసుకున్నారు.

ఎంపీ సంతాపం..

రజిత హఠాన్మరణం పట్ల వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలుగు సాహితీలోకానికి, వరంగల్ సాహితీ రంగానికి రజిత మృతి తీరని లోటని పేర్కొన్నారు.

నేడు కేఎంసీకి రజిత పార్థివదేహం అప్పగింత

రచయిత్రీ అనిశెట్టి రజిత పార్థివదేహాన్ని మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు కాకతీయ మెడికల్ కాలేజీకి అప్పగించనున్నారు. రజిత వివాహం చేసుకోలేదు. ఆమెకు సొంతిల్లు లేదు. ఈ నేపథ్యంలో కేయూ ఫస్ట్ గేటు దగ్గర గల కేయూ విశ్రాంతాచార్యులు కాత్యాయనీవిద్మహే గృహంలో రజిత పార్థివదేహాన్ని సందర్శనార్థం ఉంచారు. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ఐ' బ్యాంక్ టెక్నీషియన్లు రాత్రి ఆమె కళ్లను సేకరించి భద్రపరిచారు.